క్లుప్తంగా

వాహనాల తనిఖీ



కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని ముప్ప నపల్లిలోని ప్రధాన రహదారిపై ఎస్సై వెంకటేశ్ సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

నివాళి



వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు తిరుపతి వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తిరుపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగం సాంబశివరావు, వేల్పూల కిషోర్, వెంకటేష్, బన్నీ, వంకాయల రాము, సాయి, చంద్రకళ తదితరులు ఉన్నారు.

దీపం అంటుకుని ఇల్లు దగ్ధం

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో సోమవారం ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పసుల సారలక్ష్మి ఇంట్లో దీపం వెలిగించి సమీపంలోని చెట్టు కింద స్థానికులతో మాట్లాడుతోంది. అదే సమయంలో ఇంటి నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. ప్రభుత్వం తరఫున తక్షణ సాయంగా తహసీల్దార్ వీరభద్రం.. 25 కిలోల బియ్యం, రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

చేనేత ప్రాముఖ్యతపై వ్యాస రచన పోటీలు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చేనేత ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు వాసంతి తెలిపారు. వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో శ్రావణ్ కాపీని జిల్లా స్థాయికి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, పావని, మధు, లక్ష్మి, లింగయ్య పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ఆస్పత్రులపై నిర్లక్ష్యం’

కాటారం: ప్రభుత్వ ఆస్పత్రులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ.. నిత్యం రోగులతో రద్దీగా ఉండే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నెల రోజులుగా మందులు స్టాక్ లేక పోవడం శోచనీయం అన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని ఈ ప్రాంతంలోని పేద ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటారని తెలిపారు. ఆస్పత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్‌గా మందులు కొనుక్కునే ఆర్థిక పరిస్థితులు లేక పేద ప్రజలు రోగాలతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు.



వెంకటాపురం(కె): ర్యాలీ చేస్తున్న అధికారులు



ఏటూరునాగారం: రాంనగర్‌లో..



గోవిందరావుపేటలో..



మంగపేట: దోమెడలో..



వెంకటాపురం(ఎం): మొక్క నాటుతున్న విద్యార్థులు, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

అదనపు కలెక్టర్ పి.శ్రీజ

వెంకటాపురం(ఎం): స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. హాస్టల్‌లో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అదనపు కలెక్టర్ శ్రీజ అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులచే మండల స్పెషల్ ఆఫీసర్ రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛదనం–పచ్చదనం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజు, ఎంపీఓ శ్రీనివాస్, ఎస్సై జక్కుల సతీష్, పంచాయతీ కార్యదర్శి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

ఏటూరునాగారం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని మండల ప్రత్యేక అధికారి, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వచ్ఛదనం–పచ్చదనంపై విద్యార్థులకు, అన్నిశాఖల సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల పాఠశాలల్లో స్వచ్ఛదనం–పచ్చదనంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించగా అందులో గెలుపొంది ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, శాలువాలతో సత్కరించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాంపతి మాట్లాడుతూ.. రోడ్లపై, కాల్వల్లో చెత్తాచెదారం వేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీఓ కుమార్, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, ఉప సర్పంచ్ కర్ల అరుణ, ఐకేపీ ఏపీఓ సతీష్, పశువైద్యాధికారి కృష్ణకుమార్, రొయ్యూర్ వైద్యాధికారిణి సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత పాల్గొన్నారు.

రాంనగర్‌లో

మండలంలోని రాంనగర్‌లో స్వచ్ఛదనం–పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సాంబశివరావు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, జీపీ కారోబార్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో మహిళలు, పలు కార్యాలయాల సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హనుమాన్ సెంటర్లో మానవహారం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల స్వచ్ఛ గ్రామాలుగా మార్చు కుందామని చెత్త తొలగించడంతో పాటు నీటి గుంటలను మట్టితో నింపడం, గ్రామ వీధులను, శుభ్రం చేసుకోవాలన్నారు. ఏపీఎం లక్ష్మి దుర్గ, సీసీ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 10 వరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో చెత్తను తొలగించడంతో పాటు ట్యాంకుల వద్ద శుభ్రం చేయటం, బావుల్లో క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. ఏపీఓ భవాని, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. అడవుల వలన కలిగే ఉపయోగాలను ప్రజలకు అవగాహన కలిపించారు. మండలంలోని బుట్టాయిగూడెం, చింతగూడెం, ముప్పనపల్లి, గూర్రేవులతో పాటు పలు గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ చేశారు.



ఎస్ఎస్ తాడ్వాయి: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

మంగపేట: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్ల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య, అధికారులు, పాఠశాల విద్యార్థులు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛదనం–పచ్చదనం అనే కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీఓ సుమనవాణి బహుమతులను ప్రదానం చేశారు. నాటారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి

గోవిందరావుపేట: మండల కేంద్రంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం సోమవారం పంచాయతీ కార్యదర్శి డేగల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ రహదారి 163పై ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



కన్నాయిగూడెం: చింతగూడెంలో..



వాజేడులో..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఏటూరునాగారం: కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న ఎస్సై తాజొద్దిన్



వెంకటాపురం(కె): బహుమతులు అందజేస్తున్న సీఐ బండారి కుమార్

ఏటూరునాగారం: యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై తాజొద్దిన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో డ్రగ్స్ నిర్మూలనపై ఎస్సై అవగాహన కల్పించారు. డ్రగ్స్ నిర్మూలన కరపత్రాలు విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడంలో విద్యార్థులు, యువత సైనికుల్లా పని చేయాలని సూచించారు. సమాజహితం కోసం సామాజిక స్పృహతో డ్రగ్స్ సరఫరాను, వాడకాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాలను తీసుకోవడం వల్ల శరీర అవయవాలతో పాటు మెదడుపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని తెలిపారు.

బహుమతుల ప్రదానం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు సీఐ బండారి కుమార్ సోమవారం బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వీరభద్రవరం, రెండవ స్థానంలో చిరుతపల్లి, మూడవ స్థానంలో మొర్రవానిగూడెం జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావుతో పాటు తదితరులు ఉన్నారు.

ఇసుక లారీలతో ఇబ్బందులు

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పరిధిలోని ఇసుక క్వారీలకు వచ్చే లారీలను రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచడం వలన ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారని జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడు మంచాల నాగేంద్రకుమార్ అన్నారు. లారీలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో లారీలను నిలుపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డుపై వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. క్వారీలలో వర్షాకాలం ముగిసే వరకు ఇసుక ఎగుమతులను నిలిపి వేయాలని కోరారు.

వన సంరక్షణతోనే మన సంరక్షణ

మంత్రి సీతక్క

గోవిందరావుపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, వన సంరక్షణ అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని పస్రాలోని అటవీ డివిజన్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర, టీఎస్.డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మొక్కలను నాటి పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పలు మండలాల్లోని 141 గ్రామాలకు చెందిన బ్లాక్ ఫారెస్ట్‌లో తునికాకు సేకరణ లబ్ధిదారులకు బోనస్ రూ.కోటి 55 లక్షల 74 వేల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



పస్రా అటవీ కార్యాలయంలో తునికాకు సేకరణ లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ సిగ్నెట్లో(మిషన్ భగీరథ ప్లాంట్) పరిధిలో పనిచేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మికులు సోమవారం మండల కేంద్రంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ మిషన్ భగీరథలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి 60జీఓను వెంటనే అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి పీఆర్సీ అమలు చేయాలన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని, ప్రభుత్వమే వారికి జీతాలు ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథ కార్మికులు కొండగొల్ల రాజేష్, గజ్జెల్లి ప్రశాంత్, సిసింద్రీ, పాషా, దాబీర్, లొంక రాజు, సాంబయ్య, రాజ సదానందం, శేఖర్, మహేందర్, సంకృత్, సాయి తేజ, శ్రీనివాస్, పాషా, అఖిల్, సునీల్, పవన్, శ్రావణ్, నాగేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హక్కు పత్రాలు కల్పించాలని వినతి

చిన్నబోయినపల్లి పరిధిలోని రైతులకు హక్కు పత్రాలు కల్పించాలని, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను చిన్నబోయినపల్లిలోనే నిర్మించాలని చిన్నబోయినపల్లి రైతులు వడ్కాపురం సారయ్య, లక్ష్మారెడ్డి తదితరులు మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో మంత్రికి కలిసి సమస్యలను విన్నవించారు.



ఏటూరునాగారం: మంత్రి సీతక్కకు సమస్యలను వివరిస్తున్న రైతులు

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన వతండుపుల సుమలత తల్లి రాధ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో సుమలతో కలిసి వేములపల్లి గ్రామంలో చదువుకున్న 2003–04 పదో తరగతి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, సుప్రియ, మౌనిక, రమణ, రజిత, పూర్ణచంద్ర రాజుకుమార్, మహేష్, రాజు, బాలకృష్ణ, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

చెరువుకు మరమ్మతు చేయించాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని నూగూరు చెరువుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ సోమవారం ఆయకట్టు రైతులు తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నూగూరు చెరువు మధ్య తూముకు లీకేజీ అవుతుందని, మొదటి తూముకు షట్టరు లేదని దీంతో చెరువులో నీరు వృథాగా పోతుందని వాపోయారు. గత సంవత్సరం చెరువులో నీరు లేకుండా వృథాగా పోవటంతో రైతులు తమ పంటలను నష్టపోయారని అన్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూగూరు చెరువుకు మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాని కోరారు. రైతులు చిడెం శివరవి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేగొండ: పిల్లలకు తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని జగ్గయ్యపేట క్లస్టర్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. సోమవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, మహిళా సాధికారిత కేంద్రం అవగాహన సదస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి తల్లిపాల ప్రాముఖ్యతను, పోషకాహారం గురించి తెలిపారు. అదే విధంగా మహిళా సాధికారత ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ.. ఆడపిల్లలపై లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నయన్నారు. సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉండాలని, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లలో ఫొటోలు షేర్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది మమత, డీసీపీయూ సిబ్బంది కుమార్, వీఓ సంఘం లీడర్స్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



రేగొండ: అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

టేకుమట్లలో..

టేకుమట్ల: పిల్లలకు తల్లిపాలు తగించడంతో ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్ (వీ)లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజన ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలనే పట్టించాలని సూచించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల రోగ నిరోధకశక్తి వృద్ధి చెందుతుదని తెలిపారు. భవిష్యత్‌లో బిడ్డ ఆరోగ్యానికి భరోసా తల్లి పాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల పూర్ణిమ, హేమలత, రజిత, ఏఎన్‌ఎం సంగీత, పంచాయితీ కార్యదర్శి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్లలో..



కాళేశ్వరం: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం, మెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అన్నారంలో తల్లులు, గర్భిణులకు అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి మంజూర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కాటారం: విద్యార్థులు విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏవీఎస్ ఫంక్షన్ హాల్‌లో స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా సోమవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ఇంపాక్ట్ ఫౌండేషన్ వక్తలు డాక్టర్ శ్రీకాంత్, రామ్‌కమల్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు అంటే కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యంను ఎంచుకొని ఆ గమ్యాన్ని చేరే వరకు నిరంతర కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యక్రమాల వైపు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అలాగే డీఎస్పీ రామోహ్మన్‌రెడ్డి, మండల వైద్యాధికారిణి మౌనిక, మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ వారి విద్యాభ్యాసం, ఉద్యోగ సాధన కోసం శ్రమించిన తీరును విద్యార్థులకు వివరించారు.